'అన్నదాత సుఖీభవ' విజయోత్సవ ర్యాలీ

ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతుల ఖాతాల్లోకి ఇటీవల అన్నదాత సుఖీభవ నిధులు జమ చేశామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఈ మేరకు 200 ట్రాక్టర్లతో నరసన్నపేట మార్కెట్ యార్డు నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు భారీ ఎత్తున కృతజ్ఞతా ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతేడాది ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తూ దాదాపు 64 లక్షల టన్నులు సేకరించి 24 గంటల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు చెల్లించిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, పిఎసిఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

సాగు కష్టాలు

- నీరులేక బీటలు వారుతున్న పొలాలు
- వర్షం కోసం ఎదురు చూపు

తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వరి పంట దెబ్బతింటుంది. జూన్‌లో కురిసిన వర్షాలకు ఎదలు వేశారు. 40 రోజులుగా వర్షాలు లేకపోవడంతో, ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరగడంతో పొలాలు బీటలు వారుతున్నాయి. ఇదే పరిస్థితి మరో వారం రోజులు కొనసాగితే ఈసారి వ్యవసాయం కష్టమేనని రైతులు అభిప్రాయపడుతున్నారు. సువిశాలమైన విస్తీర్ణం ఉన్నా... సాగునీటి వనరులు అందుబాటులో లేక ఏటా కరువు ఛాయలు అలుముకుంటున్నాయి. దీని ఫలితంగా వలస బాట పట్టక తప్పడం లేదని రైతులు వాపోతున్నారు.

రణస్థలం : మోటారు పైపుతో పంటకు నీరు పెడుతున్న రైతు

ప్రజాశక్తి- నందిగాం, రణస్థలం

నందిగాం మండలంలోని 47,748 ఎకరాల విస్తీర్ణం ఉంది. అందు అందులో 11416 ఎకరాల బర్రెల గ్రౌండ్లు వ్యవసాయతర భూములు ఉన్నాయి. నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ 5,473 ఎకరాలు, వేట్లాండ్ 16,045 ఎకరాలు, డ్రైలాండ్ 97,004 ఎకరాలు ఉన్నాయి. దీనికి తోడు వంశధార కాలువ కింద 9,704 ఎకరాలు ఉన్నాయి. వీటిలో ఉన్న రైతుల భూముల్లో మాత్రమే వరి పైరు కొంతమేర ఉపశమనం కలిగిస్తుంది. మండలంలో 432 చిన్న సాగునీటి చెరువులు ఉన్నాయి. దాని కింద సాగు చేసే విస్తీర్ణం 6,946 ఎకరాలు ఉంది. 40 రోజులుగా వర్షాలు జాడ లేకపోవడంతో చెరువుల కింద వెట్ ల్యాండ్ పూర్తిగా కరువు కోరల్లో చిక్కుకుంటుంది. అయితే 1994లో మాజీ సిపిఎం నాయకులు, రైతు సంఘం నాయకులు పినకాన కష్ణమూర్తి చొరవతో విశ్రాంత ఇంజినీర్ వాసుదేవరావు ఆధ్వర్యాన కాట్రగడ రిజర్వాయరు మనము చేపట్టారు. మండల ప్రాంతానికి సాగునీరు అందించాలని ప్రతిపాదన సిద్ధం చేసినా.. అది కార్యరూపం దాల్చలేదు. ఆ తరువాత 2008లో అప్పటి ఎమ్మెల్యే హనుమంతు అప్పయ్య ద్వారా కృషితో పలాస మండలం రేగులపాడు వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయరు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దాదాపు రెండు దశాబ్దాలు పూర్తికావస్తున్నా... ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ప్రభుత్వాల మారుతున్నాయి తప్ప పనిలో పురోగతి కనిపించడం లేదు. ఇదే కొనసాగితే మండల రైతాంగమంతా మృగ్యమయ్యే పరిస్థితి కనిపిస్తుంది. ఏటా అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతు నష్టాన్ని చవిచూస్తున్నాడే తప్ప సంతృప్తి వ్యక్తం చేసిన దాఖలాలు లేవు. ఎప్పటికైనా పాలకులు చొరవ చూపి మండల రైతాంగాన్ని ఆదుకునే విధంగా సాగునీటి ప్రాజెక్టులు ఏర్పాటు చేసి సాగునీరు అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని మండల రైతాంగం కోరుతుంది.

సిపిఎం డివిజన్ కార్యదర్శి నంబూరి షణ్ముఖరావు మాట్లాడుతూ పాలకులు ఇదిగో, ఇదిగో ఆఫ్‌షోర్ అంటూ కాలం వెల్లదీస్తున్నారు. సమగ్రమైన ప్రణాళికతో నిధుల విడుదల చేయించి తక్షణ కర్తవ్యంగా సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక చొరవ చూపకపోతే రైతులు, రైతు కూలీలు వలస బాట పట్టక తప్పదు. తక్షణమే ఆఫ్‌షోర్ నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రణస్థలం, లావేరు మండలాల్లో రెండు నెలలుగా అనుకున్నంత వర్షం పడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు లోటు తప్ప అధిక వర్షం కురువలేదు. చెరువులు, కుంటలు నీళ్లు లేక వెల వెల బోతున్నాయి. బోర్ల ఆధారపు పంటలు తప్ప చెరువు, కుంటలు, వర్షధార పంటలు పండవని రైతులు ఆందోళన చెందుతున్నారు. బోరు ఉన్న రైతులు మినహా ఇతర రైతులు ఎవరూ ఇప్పటి వరకు వరి నారు పోయలేదు. అక్కడక్కడ నారు పోసిన రైతుల నారు మల్లు, నీటి తడి లేక ఎండి పోతున్నాయి. సీతంవలస, రణస్థలం, జె.ఆర్.పురం, పిడుగుపాలెం, లావేటిపాలెం తదితర ప్రాంతాల్లో నారు మల్లు ఎండిపోతున్నాయి. ఉదయం, సాయంత్రం రెండు పూటలు నారుమళ్ల ఎండిపోకుండా రైతులు నీరు చల్లుకుంటూ నారుమళ్ల కాపాడుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే గాని దుక్కిదున్ని వరినాట్లు వేసే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది వర్షాలు కురవకపోతే వరి పంటపై ఆశలు వదులుకోవడమేనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఏటా తిండి గింజలకు కరువు

40 ఏళ్లుగా రెండు ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తున్నాను. ఏటా కనీసం తిండి గింజలకైనా నోచుకోక అప్పుల పాలవుతున్నాను. అప్పులు తీర్చుకోలేక ఇబ్బందులకు గురవుతున్నాను. 40 రోజులుగా వర్షాలు లేవు. వర్షాధారంపై ఆధారపడే భూములు కావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. సాగునీటి ప్రాజెక్టులు నిర్మాణం చేపట్టి నీరు అందిస్తే సస్యశ్యామలంగా తయారవుతుంది.

– బి.సుధాకర్, గిరిజన రైతు సవరలింగుపురం

దిగుబడి ఉండడం లేదు

పదేళ్లుగా నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యసాయం చేస్తున్నాను. ఏటా అప్పు చేసి నాట్లు వేస్తున్నాను. ఏటా నాలుగైదు బస్తాలకు మించి దిగుబడి రావడం లేదు. సమయానికి వర్షాలు లేకపోవడంతో పంట ఎదుగుదల ఉండడం లేదు. పంట దశలో వర్షాలు లేకపోవడంతో గింజ బలంగా ఉండడం లేదు. సాగునీటి ప్రాజెక్టు నిర్మిస్తే కనీసం అప్పుల నుంచైనా గొట్టెక్కవచ్చు.

– ఎన్.రుక్మాంగదరావు, కౌలు రైతు, హర్షబాడ

ధర్నా చేస్తున్న కెవిపిఎస్, వ్య.కా.స నాయకులు, దళితులు

దళితుల భూ సమస్యలపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి – శ్రీకాకుళం సిటీ

కోటబొమ్మాళి, లావేరు మండలంలోని బుడతవలస దళితుల భూ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగరావు సింహాచలం విమర్శించారు. దళితుల భూ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాపరిషత్ కార్యాలయం వద్ద కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటబొమ్మాళి దళితులకు 1976లో అప్పటి ప్రభుత్వం 21 మంది దళితులకు డి పట్టాలు మంజూరు చేసిందని చెప్పారు. నాటి నుంచి నేటి వరకు ఆ భూములు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. మూలపేట పోర్టు వచ్చిన తర్వాత ఆ ప్రాంతంలో భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో, కొంతమంది వ్యాపారులు దళితులు సాగు చేస్తున్న భూముల పక్కనే రియల్ ఎస్టేట్ ఏర్పాటు చేశారని చెప్పారు. అధికార యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చి దళితులను ఈ భూముల నుంచి తొలగించాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. 45 ఏళ్లుగా సాగులో ఉన్న భూమికి ప్రభుత్వం డి పట్టాలు ఇస్తే, రెవెన్యూ అధికారులు ఆ భూమిని గడ్డపారంపోగుగా చెప్పడం అన్యాయమన్నారు. ఇంతవరకు రైతు భరోసా పడితే ఈ ఏడాది ఎందుకు పడలేదని ప్రశ్నించారు. వెంటనే అన్నదాత సుఖీభవ పడేలా చర్యలు చేపట్టాలని కోరారు. కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

లావేరు మండలం బుడతవలసలోని దళితులకు ఆరు ఎకరాల ప్రభుత్వ భూమికి పట్టాలు మంజూరు చేసిందని తెలిపారు. దళితులు నీలగిరి తోట వేసుకుని జీవనం సాగిస్తుంటే, కొంతమంది పెత్తందారులు ఆ భూముల్లో ఉన్న నీలగిరి తోట నరికి ఆ భూమి తమదని దబాయిస్తున్నారని చెప్పారు. ఈ భూములు సర్వే చేసి దళితులకు, పెత్తందారులకు మధ్య భూమిని సబ్ డివిజన్ చేసే అప్పజెప్పాలని అనేక ఫిర్యాదులు చేసినా సమస్య నేటికీ పరిష్కారం కాలేదని వాపోయారు. ధర్నా అనంతరం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో కెవిపిఎస్ నాయకులు దేవాది ఉమామహేశ్వరరావు, కుప్పిలి రాజారావు, కుప్పిలి మురళి, కుప్పిలి మల్లేశ్వరరావు, కుప్పిలి రాంబాబు, పిన్నింటి లక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.

14న జెడ్‌పి స్థాయీ సంఘాల సమావేశాలు

శ్రీకాకుళం: జిల్లాపరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు ఈనెల 14వ తేదీన జెడ్‌పి సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లాపరిషత్ సిఇఒ ఎల్.ఎన్.వి శ్రీధర్‌రాజా ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ఆరో స్థాయి సంఘం, 11.30కి మూడు, 12.30 గంటలకు ఐదో స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు 2, 4, 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభ్యులు, సంబంధిత అధికారులు సమయానికి హాజరు కావాలని కోరారు.

గ్రీవెన్స్‌కు 86 వినతులు

ప్రజాశక్తి – శ్రీకాకుళం

జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు జిల్లావ్యాప్తంగా పలు సమస్యలపై 86 వినతులు వచ్చాయి. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ వినతులు స్వీకరించారు. పలాస, వజ్రపుకొత్తూరు మండలాల శివారు భూములకు వంశధార నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే శివారు భూములకు సాగునీరు అందించడంతో పాటు ఎరువులు అందించేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గౌతు శిరీష విజ్ఞప్తి చేశారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం కింద అత్యధికంగా 21, రెవెన్యూ (సిసిఎల్‌ఎ) విభాగానికి 20, వ్యవసాయ శాఖకు 11, ఇపిడిసిఎల్‌కు 8, సర్వే, సెట్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్‌కు 6, పంచాయతీరాజ్‌కు 5, మున్సిపల్ యాజమాన్యానికి 3, సామాజిక సంక్షేమానికి 3, ఎండోమెంట్స్, నీటిపారుదల, పరిశ్రమలు, గృహ నిర్మాణం, సమగ్ర శిక్ష, ప్రజారోగ్యం, నైపుణ్యాభివృద్ధి, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామ వాలంటీర్లు–వార్డు వాలంటీర్ల విభాగాలకు చెరో 1 చొప్పున వినతులు అందాయి. స్వీకరించిన అన్ని వినతుల పరిష్కారానికి సంబంధిత శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అనాథల దత్తతపై పోస్టర్ ఆవిష్కరణ

అనాథ పిల్లలకు కుటుంబ సంరక్షణ కల్పించే ఉద్దేశంతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఫోస్టర్ కేర్, దత్తతపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత శాఖ మిషన్ వాత్సల్య పథకం కింద నిర్వహిస్తోంది. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ డే సందర్భంగా అధికారులతో కలిసి కలెక్టర్ ఈ పోస్టర్‌ను విడుదల చేశారు. అనాథ శిశువులను ముళ్లపొదలు, చెత్త కుప్పల్లో వదిలివేయకుండా జిల్లా బాలల రక్షణ విభాగానికి గానీ 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు బి.పద్మావతి, జయదేవి తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి – టెక్కలి రూరల్

టెక్కలి కేంద్రంలో అనుమతుల్లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపట్టే వారిపై ప్రత్యేక దృష్టిసారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. టెక్కలి పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో ఎక్కడా రాజీ పడకుండా ఉండాలని, అధికారులు ఈ విషయంలో అలసత్వం వహించరాదని హెచ్చరించారు. అన్ని వీధుల్లో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వానికి ఆదాయ మార్గాలు వచ్చే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని పునరుద్ఘాటించారు. అర్హత ఉన్న వారు టెక్కలి ఆర్‌డిఒ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని మంత్రి అచ్చెన్నాయుడు వైద్యులకు సూచించారు. పట్టణంలోని జిల్లా కేంద్రాస్పత్రిని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలనను స్వయంగా పరిశీలించారు. హాజరు పట్టికలో సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఒపి విభాగం, అత్యవసర విభాగం, జనరల్ వార్డు, ఎముకల విభాగంతో పాటు అన్ని వార్డులను స్వయంగా పరిశీలించి రోగులతో మాట్లాడారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అన్ని విభాగాల్లోని ఫ్యాన్లు, లైట్లు, మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణను నిశితంగా గమనించారు. అనంతరం వైద్యులు, స్టాఫ్ నర్సులు, సిబ్బందితో ఆస్పత్రిలోని సమావేశ మందిరంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రోగులకు ఇబ్బందులు లేకుండా ఫ్యాన్లు, లైట్లు, జనరేటర్ వినియోగంలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరిస్తానన్నారు. మెరుగైన వైద్యంతోపాటు ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పర్యవేక్షించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ సూర్యారావును ఆదేశించారు. రోగుల బెడ్‌షీట్లు, మరుగుదొడ్లు, ఆస్పత్రి నిర్వహణ అంశాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తిని ఆదేశించారు. స్టాఫ్ నర్సులు, సిబ్బంది కొరత ఉందన్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకురాగా, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి స్టాఫ్ నర్సుల నియామకానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఎస్‌పితో ఫోన్లో మాట్లాడి ఆస్పత్రి వద్ద అవుట్‌పోస్టు ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు వైద్య సేవలందించేందుకు అంబులెన్స్‌లను ఏర్పాటు చేస్తానని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు లక్ష్మణరావు, మహరాజ్, స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాస్వామ్యానికి తీరని ద్రోహం

- రాహుల్ గాంధీ విజ్ఞప్తిని సుప్రీం 'సుమోటోగా స్వీకరించాలి
- కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి

సమావేశంలో మాట్లాడుతున్న కృపారాణి

ప్రజాశక్తి – టెక్కలి

దేశంలో ప్రజలు ఒకరికి ఓట్లేసి, వేరొకరితో పాలింపబడుతున్నారని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కిల్లి కృపారాణి విమర్శించారు. స్థానిక తన నివాసంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై ఎన్నికల సంఘం హేతుబద్ధంగా స్పందించకుండా ప్రతిపక్షాలను బెదిరించే ధోరణిలో ప్రవర్తిస్తోందని విమర్శించారు. 2024 ఎన్నికల్లో అవకతవకలపై రాహుల్ గాంధీ అన్ని ఆధారాలు చూపించారని తెలిపారు. 4.75 కోట్ల ఓట్లు తారుమారయ్యాయని, 79 పార్లమెంటు స్థానాల్లో ఈ ప్రభావం పడిందన్నారు. బీహార్‌లో లక్షలాది ఓట్లను తొలగిస్తున్నారని తెలిపారు. ఎన్నికల కమిషన్ ప్రతిష్టను దిగజార్చకుండా స్వతంత్రంగా, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో అవకతవకల ఫలితంగా ఇవిఎంల ట్యాంపరింగ్ ద్వారా ఎన్నికల కౌంటింగ్‌లో సుమారు 5 లక్షల ఓట్లు అధికంగా వచ్చినా రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన వైసిపి నోరు మెదపడం లేదన్నారు. వైసిపితో సహా వామపక్షాలు, ప్రజాసంఘాలు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు రాహుల్ గాంధీతో కలిసి రావాలని ఆమె కోరారు. సుప్రీంకోర్టు ఈ విషయంలో కల్పించుకుని ఎన్నికల సంఘం తీరుపై విచారణ కేసును సుమోటోగా స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. పిసిసి అధ్యక్షురాలిగా తనపై వస్తున్న వార్తలు ఊహాజనితమేనన్నారు. పిసిసి అధ్యక్షులు షర్మిల పార్టీని పటిష్టం చేసే దిశగా కృషి చేస్తున్నారని చెప్పారు. డిసిసి అధ్యక్షుల నియామకం కోసం కసరత్తు చేస్తున్నారని తెలిపారు.

15న ప్రతి ఇంటా మువ్వన్నెల రెపరెపలు

ప్రజాశక్తి – శ్రీకాకుళం

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 15న జిల్లాలో ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగురవేసి దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. నగరంలోని సూర్యమహల్ జంక్షన్ నుంచి ఏడు రోడ్ల జంక్షన్ వరకు నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి నివాళులర్పించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ, 'హర్ ఘర్ తిరంగా'లో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలని కోరారు. జాతీయ పతాకాన్ని ఇంటిపై ఎగురవేయడంతో పాటు, సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో జెండాతో ఫొటోలు తీసి సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఇప్పటికే కార్యక్రమానికి జిల్లాలో మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. వాలంటీర్ రిజిస్ట్రేషన్లను https://harghartiranga.com/become-volunteer నమోదు చేయాలని, సెల్ఫీలను https://harghartiranga.com/selfie వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. ర్యాలీలో ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, పలు శాఖల అధికారులు, పలు కళాశాలల విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న మంత్రి, కలెక్టర్, ఎస్‌పి తదితరులు

నేడు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

శ్రీకాకుళం: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 12న 1 నుంచి 19 ఏళ్ల వారికి అల్బెండాజోల్ మాత్రలను ఉచితంగా అందించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. మాత్రలు వేసుకోకుండా మిగిలిపోయిన పిల్లలకు ఈనెల 20న మాప్ అప్ డే ద్వారా మాత్రలు అందజేయనున్నట్లు చెప్పారు. పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, వారి విద్యా ప్రగతికి తోడ్పడడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటిఐలు, పాలిటెక్నిక్, నర్సింగ్, డిగ్రీ కళాశాలల్లో జరుగుతుందన్నారు. పాఠశాలకు వెళ్లని, అంగన్వాడీల్లో నమోదు కాని పిల్లలూ మాత్రలు పొందవచ్చని చెప్పారు. ఒకటి నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు మాత్రలను గుండ చేసి, మిగిలిన పిల్లలకు మాత్రలను నమలించి తినిపించాలని సూచించారు. అనారోగ్యంతో ఉన్న వారికి మాత్రలు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. డీవార్మింగ్ వల్ల అరుదుగా వాంతులు, విరేచనాలు, బలహీనత వంటి స్వల్ప దుష్ప్రభావాలు కనిపించవచ్చని, ఇవి తాత్కాలికమని, అవసరమైతే వైద్య సిబ్బంది తక్షణమే చికిత్స అందిస్తారని తెలిపారు. నులిపురుగుల నివారణ పిల్లల శారీరక, మానసిక వికాసానికి కీలకమన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకరించి పిల్లలందరికీ మాత్ర వేయించేలా చూడాలని పిలుపునిచ్చారు.

సమన్వయంతో వజ్రోత్సవాల నిర్వహణ

ప్రజాశక్తి – శ్రీకాకుళం

ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న శ్రీకాకుళం జిల్లా 75వ ఆవిర్భావ వజ్రోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. స్థానిక కోడి రామ్మూర్తి స్టేడియంలో వేడుకల ఏర్పాట్లను ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఇతర అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. మూడు రోజుల పాటు పలు సాంస్కృతిక, క్రీడా, ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖను ఆదేశించారు.

వజ్రోత్సవాల కార్యక్రమాల షెడ్యూల్

13న ఉదయం 7 గంటలకు రన్ ఫర్ శ్రీకాకుళం – ఆర్ట్స్ కళాశాల మైదానం. 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇన్వెస్టర్ల సమావేశం – నాగావళి హోటల్. సాయంత్రం ఐదు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు స్వర్ణ శ్రీకాకుళం ఫెయిర్ అండ్ ఎగ్జిబిషన్ – కోడి రామ్మూర్తి స్టేడియం.

14న ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పలు క్రీడా పోటీలు – మున్సిపల్ హైస్కూల్ మైదానం, ఏడు రోడ్ల జంక్షన్. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎస్సే రైటింగ్, క్విజ్, డ్రాయింగ్ పోటీలు – ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల. సాయంత్రం ఐదు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు స్వర్ణ శ్రీకాకుళం ఫెయిర్ అండ్ ఎగ్జిబిషన్ – కోడి రామ్మూర్తి స్టేడియం.

15న ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు – ఆర్ట్స్ కళాశాల మైదానం. సాయంత్రం ఐదు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ప్రఖ్యాత వ్యక్తుల సత్కారం, సాంస్కృతిక కార్యక్రమాలు – కోడి రామ్మూర్తి స్టేడియం. సాయంత్రం ఐదు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు స్వర్ణ శ్రీకాకుళం ఫెయిర్ అండ్ ఎగ్జిబిషన్ – కోడి రామ్మూర్తి స్టేడియం.



కోడి రామ్మూర్తి స్టేడియాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి తదితరులు

మాట్లాడుతున్న రామ్మోహన్

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి – శ్రీకాకుళం

జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.రామ్మోహన్, కె.ప్రశాంత్ కుమార్ డిమాండ్ చేశారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ 14వ ప్లీనరీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా దీవెన, వసతి దీవెన రూ.6,400 కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. జిఒ నంబరు 77ను రద్దు చేసి ప్రైవేట్ ఎయిడెడ్ విద్యాసంస్థల పిజి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించాలన్నారు. విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు పెంచాలని. డిగ్రీలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు కోర్సు ఎంపిక చేసే హక్కులను ఇది కాలరాస్తుందని, పరీక్షా విధానం అంతా గందరగోళం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందన్నారు. సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ విద్యార్థులకు ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటానికి సిద్ధం కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనింగ్ కమిటీ నియామకం

ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనింగ్ కమిటీని 15 మంది సభ్యులతో నియమించారు. జిల్లా కన్వీనర్‌గా పి.పవిత్ర, కన్వీనింగ్ కమిటీ సభ్యులుగా డి.చందు, పి.ఖగేష్, దుర్గాప్రసాద్, జయరాం, చిన్న, దివ్య, ఉమామహేష్, శివ, నందిని, భార్గవ్, సుమిత్ ఉన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

పబ్లిక్ గ్రీవెన్స్‌లో స్వీకరించే అర్జీలు పునరావృతం కాకుండా ఆయా ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి శాశ్వత పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం' నిర్వహించారు. ముందుగా వృద్ధులు, దివ్యాంగులు వద్దకు ఎస్‌పి స్వయంగా వెళ్లి వారి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో పలు ప్రాంతల నుంచి వచ్చిన 43 మంది ఫిర్యాదుదారులతో ముఖాముఖీగా మాట్లాడి వారి ఫిర్యాదులను వివరంగా అడిగి తెలుసుకుని ఫిర్యాదులపై విచారణ జరిపి, సత్వరం పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో మాట్లాడి త్వరితగతిన చట్ట ప్రకారం విచారణ జరిపి భాదితులకు న్యాయం అందించేలా చూడాలన్నారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి అందజేయాలని అధికారులను సూచించారు.

తరగతి గదిలో ఫ్యాన్ల ఏర్పాటు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని రాపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3,4 తరగతుల గదుల్లో ఫ్యాన్లను హెచ్‌ఎం సిహెచ్ శారదాంబ సోమవారం ఏర్పాటు చేశారు. ఈనెల 7న 'ఉక్కపోతలోనే విద్యార్థులకు పాఠాలు' అంటూ ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. నాడు - నేడు పనుల్లో భాగంగా నిర్మించిన ఈ తరగతి గదుల్లో 3,4 తరగతుల విద్యార్థులకు పాఠాలను ఉపాధ్యాయులు బోధించే వారు. తరగతి గదుల్లో ఫ్యాన్లు లేకపోవడంతో విద్యార్థులు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారంటూ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు తరగతి గదుల్లో ఫ్యాన్లు ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారం కావడంపై తల్లిదండ్రులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తరగతి గదిలో ఏర్పాటు చేసిన ఫ్యాన్లు

అక్రమాలకు అడ్డు లేదు

కబ్జాకు గురైన చిన్నాన్న కర్ర చెరువు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలో ఆక్రములకు అడ్డు లేకుండాపోయింది. ఆక్రమణకు కాదేది అనర్హం అన్న చందాన ఎవరికి ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ బాగా వేసేస్తున్నారు. దీంతో ముఖ్యంగా చెరువులు, బందలు, కోనేరులు వంటివి కూడా నామరూపాలు లేకుండా పోతున్నాయి. ఇటీవల కోటబొమ్మాళి పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 237/2లో రెండు ఎకరాలు విస్తీర్ణంలో గల చిన్నాన్న కర్ర అనే చెరువు కబ్జాకు గురైంది. అంచెలంచెలుగా చెరువు ఆక్రమిస్తూ సురువు గర్భాన్ని ఇప్పుడో పూర్తిగా మట్టితో పూర్తి వేశారు. ఈ చెరువు కింద సుమారు 45 ఎకరాలు హాయ్ కొట్టు సాగవుతుండేది. ఇప్పుడు చెరువు పూర్తిగా నామరూపాలు లేకుండా పోవడంతో కింద రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. కొంత భాగం వంశధార కాలువ ద్వారా వస్తున్న నీరు కలుస్తుండటంతో కొంత ఊరట కలుగుతుంది. అయితే మిగతా వర్షాధారం కావాల్సినా పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనిపై ఇప్పటికే స్థానికుల కొంతమంది స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా, అతి గోప్యంగా పరిశీలించిన అధికారులు ఇప్పటికే పనులు నిలుపుదల చేశారు. అయితే స్థానికంగా దీర్ఘకాలికంగా పని చేస్తున్న కొంతమంది రెవెన్యూ సిబ్బందికి అసలు ఈ చెరువు పేరు, దాని విస్తీర్ణం, దాని సర్వే నంబరు తెలియని పరిస్థితిలో ఉండటం గమనార్హం. ఇటువంటి నేపథ్యం లోనే చెరువులు, బందలు, కోనేరులు కేవలం రెవెన్యూ రికార్డుల్లోనే కనిపిస్తు న్నాయి తప్ప పరిసర ప్రాంతాల్లో వాటిని నామరూపాలేకను మరుగ య్యేయి. ఇప్పటికైనా అధికారులు ఇటువంటి ఆక్రములపై దృష్టి సారించక పోతే రానున్న రోజుల్లో రైతుకు సాగునీరు కరువయ్యే పరిస్థితులు ఏర్పడనున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయమై తహశీల్దార్ అప్పలరాజును వివరణ కోరగా, ఇటీవలే తన దృష్టికి వచ్చిందని, పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 3వ వార్డు పెంటిభద్ర గ్రామ రహదారిలో నాటుసారా తాగి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందారు. సోమవారం ఉదయం స్థానికులు గుర్తించి కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు. ఆదివారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు వచ్చి సమీప గ్రామంలో నాటుసారా తాగి రోడ్డుపై వస్తుండగా కుంకుమ సాగరం చెరువు వద్ద పడిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. రాత్రి సమయంలో ఒకరు వెళ్లిపోగా, మిగిలిన వ్యక్తి ఉదయానికి మృతి చెందినట్లు గ్రామస్తులు గుర్తించారు. మృతుడు పడి ఉన్న ప్రాంతంలో తాగి విడిచిన నాటుసారా ప్యాకెట్లు లభించాయి. సంఘటన స్థలానికి కాశీబుగ్గ పోలీసులు చేరుకొని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాశీబుగ్గ ఎక్సైజ్ సిఐ కె.మల్లిఖార్జునరావు తన సిబ్బందితో వచ్చి పరిశీలించారు. చెత్తను సేకరించే వ్యక్తిగా అనుమానం వ్యక్తం చేశారు. కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి జైలు శిక్ష

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని బంటుపల్లికి చెందిన మన్నే శ్యాంకుమార్‌కు 30 రోజులు జైలు శిక్ష విధించినట్లు జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం రాత్రి 10 గంటలు దాటిన తరువాత మన్నే శ్యాంకుమార్ బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించి ప్రజలను ఇబ్బంది పెడుతూ, రాత్రి పోలీస్ స్టేషన్‌కి వచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సిబ్బందితో ఇబ్బందికరంగా ప్రవర్తించడంతో సోమవారం సదరు మన్నే శ్యామ్ కుమార్‌ను శ్రీకాకుళం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వద్ద హాజరుపర్చగా 30 రోజులు జైలు శిక్ష విధించడం జరిగిందని పేర్కొన్నారు.

ఏడు కేజీల గంజాయి పట్టివేత

కొత్తూరు : చెన్నయ్‌కు చెందిన ఎం.సూర్య ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న ఏడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ఎం.ఎ.అమీర్ ఆలీ తెలిపారు. సోమవారం మాతల చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారని తెలిపారు. సూర్యను అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

26 మద్యం సీసాలు పట్టివేత

కొత్తూరు : మండలంలోని మెట్టూరుకు చెందిన సనపల తిరుపతిరావు టీ స్టాల్ షాపు వద్ద అక్రమంగా ఉన్న 18 మద్యం బాటిళ్లను ఎస్ఐ ఎం.ఎ.అమీర్ అలీ దాడి చేసి పట్టుకున్నారు. వీటి విలువ రూ.3,150 ఉంటుందన్నారు. అలాగే అదే గ్రామానికి చెందిన నెమలిపూరి కళ్యాణి ఇంటి వద్ద 8 మద్యం బాటిళ్లు అక్రమంగా ఉండటంతో వాటినీ పట్టుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నేడు జాబ్‌మేళా

నరసన్నపేట: స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు డైరెక్టర్ సిహెచ్.దుర్గప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 15 కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటాయని, యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభిస్తారని తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గం

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి సబ్‌ట్రజరీ పరిధిలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం ఎంపిక సోమవారం సంఘ కార్యాలయంలో నిర్వహించారు. నూతన సంఘం అధ్యక్షునిగా రోణంకి రామచంద్రరావు, సహాధ్యక్షులుగా రెయ్యి పున్నయ్య, కార్యదర్శిగా కూర్మాన ధనుంజయరావు, కోశాధికారిగా బొడ్డ అయ్యబాబు, గౌరవాధ్యక్షులుగా మట్ట లక్ష్మీనారాయణ, సలహాదారునిగా జీవిరెడ్డి మాస్టారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల ప్రదాన హరిశ్చంద్రరావు, కుప్పిలి కామేశ్వరరావు, హనుమంతు నాగేశ్వరరావు, అనిశెట్టి చిట్టెన్న, దల్లి వీరాస్వామిరెడ్డి పాల్గొన్నారు.

ఎపిజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా జోగినాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జోగినాయుడు

జర్నలిస్ట్ సంఘాల్లో నాలుగు దశాబ్దాల కాలంగా వివిధ హోదాల్లో సేవలందిస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శాసపు జోగినాయుడుకు ఆంధ్ర ప్రదేశ్ జర్నలిస్టుల ఫోరంలో రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి లభించింది. జిల్లా కేంద్రంలో ఆకాశవాణి, దూరదర్శన్ న్యూస్ విభాగానికి ప్రతినిధిగా పనిచేస్తున్నారు. జోగినాయుడుకు రాష్ట్రస్థాయిలో జర్నలిస్టుల ఫోరం గుర్తించి కీలకమైన ఉపాధ్యక్ష పదవి కేటాయించడంపై జిల్లా జర్నలిస్టులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కంప్యూటర్ సైన్స్ ఆనర్స్ కోర్సు మంజూరు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని తొగరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్ ఆనర్స్ కొత్త కోర్సు ప్రారంభించడానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సత్యనారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ భరత్ నారాయణ గుప్తా ఆదేశాల మేరకు ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో మొత్తం ఆరు కోర్సులు అందుబాటులో ఉండనున్నట్లు తెలిపారు. వీటిలో బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్ ఆనర్స్‌తో పాటు బిఎస్‌సి మ్యాథమెటిక్స్, జువాలజీ, బోటనీ, బిఎ పొలిటికల్ సైన్స్, బికాం కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సులు ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఎన్‌ఎంఎంఎస్ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- కవిటి

మా మాణిక్యేశ్వరి హెల్పింగ్ హేండ్స్ సంస్థ తన ప్రత్యేకత చాటుకుంది. మండలంలోని మాణిక్యపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తమ సంస్థ తరుపున ఎన్‌ఎంఎంఎస్ మెటీరియల్ ఉచితంగా అందించి ఆదర్శంగా నిలిచింది. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మా మాణిక్యేశ్వరి హెల్పింగ్ హేండ్స్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ప్రసాద్

బస్ సౌకర్యం కల్పించాలని వినతి

ప్రజాశక్తి- కొత్తూరు

టెక్కలి రెవెన్యూ డివిజన్ కేంద్రం నుంచి మండల కేంద్రానికి ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ బాలకృష్ణను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ డివిజన్ కేంద్రాలు విభజన అనంతరం 2024లో టెక్కలి ఆర్‌టిసి బసుస డిపో నుంచి మండల కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించారని అన్నారు. కొద్దిరోజుల అనంతరం బస్సు సౌకర్యం రద్దు చేసి అన్యాయం చేశారని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు, డివిజన్ స్థాయి అధికారులకు ప్రజలు వివిధ రకాల పనులకోసం వెళ్లడానికి తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జిల్లా అధికారులు జోక్యం బస్సు సౌకర్యం కల్పించాలని, లేకుంటే ప్రజా ఆందోళన తప్పదని హెచ్చరించారు.

దుస్తులను పంపిణీ చేస్తున్న విప్ అశోక్

ఘనంగా విప్ వివాహ వార్షికోత్సవం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ వివాహ వార్షికోత్సవాన్ని రాష్ట్ర బిసి సాధికారిత సమితి కన్వీనర్ కొండ శంకర్‌రెడ్డి ఆధ్వర్యాన సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్ వద్ద పేదలకు దుస్తుల పంపిణీ, అన్నదానం, రక్తదానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలపై విప్ అభినందించారు. కార్యక్రమం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, పట్టణ టిడిపి అధ్యక్షుడు పత్రీ తవిటయ్య, కార్యదర్శి నందిగాం కోటేశ్వరరావు, దక్కత ఢిల్లీరావు, టిడిపి నాయకులు కాళ్ల జయదేవ్, కాళ్ల దిలీప్, లీలారాణి, గేదెల శేఖర్, నందిక జాని, గిన్ని వెంకటరమణ, దక్కత విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

మురుగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 21వ వార్డులో మురుగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు కమిషనర్ ఎన్.రామారావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పరిసరాల్లోకి మురుగు నీరు చేరడంతో తీవ్రస్థాయిలో దుర్గంధం వెదజల్లుతోందని వివరించారు. కంపు భరించలేక స్థానికులు రోగాల బారిన పడే పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు నీటి వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. మురుగు నీరు నిలిచిన ప్రాంతాన్ని పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తూముల సునీల్ కుమార్, హెచ్.కృష్ణారావు, కామరాజు, కె.జగదీశ్, రాజేష్ పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రత్యేక తనిఖీలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలను ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు గంగా ప్రియదర్శిని, ఎం.ఉషశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పరీక్షలకు వివిధ గ్రామాల నుంచి సుమారు నలభై మంది గర్భిణులు హాజరుకాగా వీరికి రక్త పరీక్షలు, ఉచిత స్కానింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణే లక్ష్యంగా ప్రతి నెల నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గర్భిణీలకు తనిఖీలు నిర్వహించి హైరిస్క్ గర్భిణులను గుర్తించడం, వారికి ప్రత్యేకమైన పర్యవేక్షణలో వారు ప్రసవం అయినంతవరకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వడం, ఆస్పత్రిలో చేర్పించి సుఖప్రసవం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ బి.రమేష్ బాబు, జెమ్స్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

శభాష్ శృతి

బంగారు పతకంతో శృతి

కవిటి: కవిటి గ్రామానికి చెందిన మొగిలిపురి శృతి నడక పోటీల్లో బంగారు పతకం సాధించి శభాష్ అనిపించుకుంది. వివరాల్లోకి వెళ్తే... బాపట్లలో నిర్వహించిన అంతర్రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో 10వేల మీటర్ల నడక విభాగంలో శృతి మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సొంతం చేసుకుంది. 4x400 రిలేలో పోటోల్లో కూడా మొదటి స్థానం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా స్థానిక ఉషోదయ యువజన సంఘం సభ్యులు, సొండికుల సంక్షేమ సంఘం సభ్యులు శతికి అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యేను సత్కరిస్తున్న జనసేన నాయకులు

ఎమ్మెల్యేని కలిసిన జనసేన నాయకులు

రణస్థలం: జనసేన తరుపున రణస్థలం రైతుసేవా సహకార సంఘం లిమిటెడ్ (ఎఫ్‌ఎస్‌సిఎస్) చైర్మన్‌గా నియమితులైన బొంతు విజయ్ కృష్ణ, పైడిభీమవరం పిఎసిఎస్ డైరెక్టర్‌గా నియమితులైన దన్నాన రవీంద్ర, జనసేన నాయకులు వడ్డాది శ్రీను, జనసేన నాయకులు ఎచెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును సోమవారం కలిసి అభినందనలు తెలిపారు.

లోగో ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ బాలాజీ తదితరులు

విశ్వ సాహితీ సంస్థ పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

యువతలో తెలుగుభాషపై అనురక్తిని పెంచే లక్ష్యంతో సరికొత్తగా ఏర్పాటైన విశ్వ సాహితీ సంస్థ ఆవిష్కరణ మహోత్సవ పత్రికను సోమవారం ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటి ఆవరణలో ఆవిష్కరించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి బాలాజీ, పరిపాలనా అధికారి డా.ముని రామకృష్ణ, డీన్ శివరామకృష్ణ, వెల్ఫేర్ డీన్ డా. గేదెల రవి, జాతీయ సేవా పథకం కో- ఆర్డినేటర్ డా.పెద్దింటి ముకుంథరావు, తెలుగు శాఖ అధ్యక్షులు డా.పి. చిరంజీవిరావు, ప్రతినిధులు ఈ వేమన, జంధ్యాల శరత్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూడికలు తీస్తున్న కార్మికులు

ముమ్మరంగా పూడికతీత పనులు

కొత్తూరు: వర్షాకాలం దృష్ట్యా ప్రజలు రోగాలు బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా సర్పంచ్ పడాల కృష్ణవేణి, కార్యదర్శి అప్పలరాజు ఆధ్వర్యాన సోమవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. పడాలవీధి, కుమ్మరి వీధి, చోడవరపు వీధి, రెల్లి వీధిల్లో పారిశుధ్య కార్మికులు కాలువల్లోని పూడికను తొలగించారు. అనంతరం డంపింగ్‌యార్డుకు తరలించారు. వీరి వెంట చోడవరపు గోవింద ఉన్నారు.

కృష్ణచైతన్య పరామర్శ

నరసన్నపేట : మండలంలోని మడపాంలో అనారోగ్యంతో బాధపడుతున్న రువ్వ సురేష్, తాండ్రంకి అప్పన్నలను పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణదాస్, ఎంపిపి ఆరంగి మురళీధర్, జెడ్‌పిటిసి చింతు రామారావు సోమవారం పరామర్శించారు. వీరి వెంట వైసిపి మండల అధ్యక్షులు లుకలాపు రవి, నియోజకవర్గ పంచాయతీరాజ్ అధ్యక్షులు రమణయ్య, మండలయూత్ అధ్యక్షులు రాజశేఖర్ ఉన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి- పొందూరు

గ్రామాల్లో పారిశుధ్యం నిర్వాహణపై నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని డిఎల్‌పిఒ కె.గోపీబాల పేర్కొన్నారు. మండలంలోని రాపాకలో పారిశుధ్య పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురు అనుమానిత డయేరియా లక్షణాలతో బాధ పడుతున్నట్లు గ్రామానికి చెందిన జనసేన నాయకులు కొంచాడ సూరీడు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంపై స్థానిక అధికారులతో ఆయన సమీక్షించారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆదివారం క్లోరినేషన్ చేసిన రక్షిత మంచినీటి పథకాన్ని ఆయన పరిశీలించారు. తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయడంతో పాటు, మురుగు కాలువలు, అపారిశుధ్య ప్రాంతాల్లో చెత్తా చెదారాలను తొలగించి శుభ్రం చేయాలని కార్యదర్శి పి.శ్రీనివాసరావుకు సూచించారు. అలాగే రక్షిత మంచినీటి పథకానికి తాగునీటి సరఫరా చేసే బావిని డిప్యూటీ ఎంపిడిఒ పి.సింహాచలం, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఎం.వి.కె.నాయుడులతో కలిసి పరిశీలించారు. బావిలో ఉన్న చెత్తా చెదారాలను, చుట్టూ పేరుకుపోయిన పిచ్చిమొక్కలును తొలగించి శుభ్రం చేయాలన్నారు. ఈయన వెంట సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

అధికారులతో మాట్లాడుతున్న డిఎల్‌పిఒ గోపీబాల

చెస్ క్రీడాకారులతో వేణుగోపాల్

చెస్‌లో చిన్నారుల నైపుణ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

చెస్ క్రీడలో శ్రీకాకుళం జిల్లా చిన్నారులు నైపుణ్యం సాధించి, పోటీల్లో రాణిస్తూ, అవార్డులు గెలుపొందుతుండడం అభినందనీయమని ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ పేర్కొన్నారు. నగరంలోని ఇల్లీసిపురం ప్రాంతంలో తిలక్ నగర్ నర్సెస్ కాలనీలోని స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీలో ఓపెన్ చెస్ పోటీలు జరిగాయి. జిల్లాలోని చెస్ క్రీడాకారులు ఐదు రౌండ్ల పాటు జరిగిన చెస్ పోటీల్లో అసక్తిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవంలో వేణుగోపాల్ మాట్లాడుతూ చదరంగం క్రీడ మేథావుల క్రీడని అలాంటి క్రీడలో జిల్లా చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని చెస్‌ను నేర్చుకోవడం, పోటీల్లో రాణిస్తుండటం, స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీ సంస్థ గడిచిన 16 ఏళ్లుగా జిల్లాలో 203 చెస్ టోర్నీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీసాయి దుర్గా ట్యూషన్ సెంటర్ ప్రతినిధులు, స్కూల్ అఫ్ చెస్ అకాడమీ చెస్ కోచ్‌లు, ఫిడే ఇంటర్నేషనల్ రేటింగ్ చెస్ ప్లేయర్లు భేరి చిన్నారావు, కె.సాయి నిరంజన్ సింగ్, సీనియర్ చెస్ క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కళావేదిక ప్రారంభం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని డి.గొనపపుట్టుగలో గ్రామస్తుల సాంస్కృతిక కార్యక్రమాలకు కేంద్రంగా నిలిచే సిద్ధి వినాయక నూతన కళావేదిక సోమవారం ఘనంగా ప్రారంభమైంది. మండల పరిషత్ నిధులు రూ.1,77,000లతో పాటు ప్రతిభా యువజన సంఘం, గ్రామస్తులు అందించిన ఆర్థిక సాయంతో ఎంపిటిసి చందాన పూర్ణ చంద్రుడు ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ హాజరై కళావేదికను ప్రారంభించారు. అనంతరం అతిథులను గ్రామస్తులు సత్కరించారు. సర్పంచ్ బెందాళం కిరణ్‌కుమారి, సర్పంచ్ ప్రతినిధి జయప్రకాష్, ఎంపిటిసి చందాన పూర్ణచంద్రుడు, కో-ఆప్షన్ మెంబర్ పాండవ చంద్రశేఖర్, జల్లు యుగంధర్, యలమంచిలి నీలయ్య, మోహన్ సాహు, బొడ్డ లక్ష్మణమూర్తి, కోదండరావు, రామారావు, లోకనాథం, శ్యామలరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న గ్రామస్తులు

పలాస : సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి మాధురి

ఎక్కువ కేసులు రాజీ కావాలి

ప్రజాశక్తి- పలాస

సెప్టెంబరు 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జడ్జి యు.మాధురి తెలిపారు. పలాస కోర్టులో సోమవారం పోలీస్, ఎక్సైజ్ పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా చూడాలని కోరారు. లోక్ అదాలత్ నిర్వహిస్తున్న విషయాన్ని ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, క్రిమినల్ కేసులను సత్వరమే గుర్తించి ఆ కేసుల్లో కక్షిదారులందరికీ నోటీసులు ఇచ్చి, రాజీ కోసం ప్రయత్నం చేయాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.రమేష్, ఎక్సైజ్ సిఐ కె.మల్లికార్జునరావు, వజ్రపుకొత్తూరు, కాశీబుగ్గ పోలీసులు పాల్గొన్నారు.

సోంపేట : జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆరో అదనపు జిల్లా జడ్జి కె.కిషోర్‌బాబు కోరారు. స్థానిక కోర్టు హాల్‌లో బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసు అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. పరిష్కరించదగ్గ కేసులను ఎక్కువగా రిఫర్ చేయించుకొని, పార్టీలను రాజీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్, కాశీబుగ్గ డిఎస్‌పి వెంకట అప్పారావు, సోంపేట సిఐ మంగరాజు, ఎక్సైజ్ సిఐ రమణ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

సాగునీరు అందించాలి

టెక్కలి : మండలంలోని పాతనౌపడా పంచాయతీ పరిధి జెండాపేటకు చెందిన రైతులు కోరారు. ఈ మేరకు ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. లోతట్టు ప్రాంతంగా ఉన్న తమ గ్రామానికి ఖరీఫ్ సీజన్‌లో వంశధార కాలువ ద్వారా సాగునీరు అందుతుండేదని, ఈ నీటి ద్వారా సమీపంలోని చెరువులు నీటితో నింపుకుని వ్యవసాయానికి వినియోగించుకునే వారమని అన్నారు. అయితే ఈ ఏడాది వంశధార సాగునీరు రాకపోవడంతో మూడు వందల ఎకరాలు ఆయుకట్టు ఎండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించి ఆయుకట్టు రైతులకు సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. దీనిపై ఆర్‌డిఒ సానుకూలంగా స్పందించారు.

వినతిపత్రం అందజేస్తున్న రైతులు

60 రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం

ప్రజాశక్తి- పలాస

విద్యుత్ శాఖకు సంబంధించిన ఫిర్యాదులను 60 రోజుల్లో పరిష్కరిస్తామని ఎపి తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ బి.సత్యనారాయణ అన్నారు. పలాస విద్యుత్‌శాఖ కార్యాలయం ఆవరణలో సోమవారం ఎపి తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యాన వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు 11 జిల్లాలు మా పరిధిలో ఉంటుందని తెలిపారు. 2005 నుంచి 2025 జూలై వరకు 9082 దరఖాస్తులు రాగా, 8844 దరఖాస్తులను పరిష్కరించామని చెప్పారు. 111 మంది వినియోగదారులకు విద్యుత్‌శాఖ నుంచి రూ.14,59,950లు నష్టపరిహారం ఇప్పించామని చెప్పారు. ఇప్పటి వరకు 121 ప్రాంతాల్లో అవగాహనా సదస్సులు నిర్వహించామని తెలిపారు. విద్యుత్ సమస్యలపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే అండగా నిలబడి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫిర్యాదు చేసేందుకు 9440014734 వాట్సాప్ నంబరు, మెయిల్, పోస్ట్, ఆన్‌లైన్‌తో పాటు నేరుగా వ్యక్తిగతంగా ఫిర్యాదు చేసుకోవచ్చు అన్నారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానంలో వెలువడిన తీర్పుకు తృప్తి చెందకపోతే ఎపి విద్యుత్ అంబుడ్స్ మన్‌కు ఫిర్యాదు చేసుకోవచ్చు అన్నారు. అక్కడా తృప్తి చెందకపోతే హైకోర్టులో ఫిర్యాదు చేసుకొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇటీవల వినియోగదారుల పిర్యాదులు సంఖ్య పెరుగుతుందన్నారు. పలాసలో 11 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు ఎస్.సుబ్బారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.యజ్ఞేశ్వరరావు, ఎడిఇ కృష్ణమూర్తి, ఎఎఒ కె.బాస్కరరావు, ఎఇలు వివేకానంద్, నాగభూషణరావు పాల్గొన్నారు.

వినతులను స్వీకరిస్తున్న సత్యనారాయణ

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ఆమదాలవలస : చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రాజు తదితరులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని శ్రీనివాసాచార్యులపేట, అక్కులపేట గ్రామాల్లో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా శ్రీ సీతారామ చేనేత సంఘం ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతిరావు ఆధ్వర్యంలో చేనేత కార్మికులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న చేనేత సంక్షేమ పథకాలైన మగ్గాలకు ఉచిత విద్యుత్, చేనేత వస్త్రాలపై జిఎస్‌టి మినహాయింపు, నేతన్న భరోసా పథకం కింద ఏడాదికి రూ.25 వేలు ఆర్థికసాయం వంటి కార్యక్రమాలను అమలు చేయనున్నారన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు నూక రాజు, మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, ఎంపిటిసిలు బొడ్డేపల్లి సుగుణ, అన్నెపు భాస్కరరావు, పిఎసిఎస్ డైరెక్టర్ బెండి దశరథరావు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

పొందూరు: రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు అనేక ప్రయోజనాలు కల్పించడంపై పొందూరు, తోలాపి గ్రామాల చేనేత కార్మికులు సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, పిఎసిఎస్ అధ్యక్షులు వండాన మురళీ, సాయిబాబా వీవర్స్ సొసైటీ మాజీ అధ్యక్షులు కాలెపు శ్రీనివాసరావు, పాపారావు, టిడిపి పట్టణ అధ్యక్షుడు చిన్న రంగా, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరావు, టిడిపి నాయకులు బాడాన శేషగిరి, కె.శ్రీనివాసరావు, కె.విజయ్‌కుమార్, చేనేత కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: చేనేత రంగం అన్ని రకాలుగా అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రామకృష్ణ అన్నారు. ఉప్పివలసలో చేనేత కార్మికులు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు రాంజీ, మాజీ జెడ్‌పిటిసి పీరుకట్ల సీతబాబు, బూర్జ మండల సొసైటీ చైర్మన్ శ్రీరామ్మూర్తి, సర్పంచ్ ప్రతినిధులు గోపి మాస్టర్, వెంకటరమణ, ఆముదాలవలస మార్కెట్ కమిటీ చైర్మన్ మజ్జి శ్రీరామ్మూర్తి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొందూరు : సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు

గుర్రపుడెక్కతో నిండిన కాలువ

కాలువను కప్పేసింది...

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో పెద్ద జగన్నాథపురం వద్ద ఉన్న కృష్ణ సాగరం కాలువ గుర్రపు డెక్కతో నిండిపోయింది. దీంతో రైతులకు సాగునీటి సమస్య తలెత్తుతుంది. కాలువనిండా గుర్రపు డెక్క దట్టంగా అలుముకోవడంతో సాగునీటికి అంతరాయం కలిగింది. దీంతో ఈ ప్రాంతంలో 60 ఎకరాల వరకు సాగునీటి వసతి లోపించింది. కాలువ అభివృద్ధి లేకపోవడంతో రైతులకు అందాల్సిన సాగునీరు అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఏటా వర్షాధారమే శరణ్యమవుతుంది. ఇరిగేషన్‌శాఖ అధికారులు స్పందించి గుర్రపు డెక్కన్ తొలగించి సాగునీటిని అందించాలని రైతులు కోరుతున్నారు.

పార్టీలో చేరిన వారితో వెంకట గోపాల సత్యనారాయణ

వైసిపిలో ఆరు కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో విజయనగరం జిల్లా వైసిపి పార్లమెంటరీ పార్టీ పరిశీలకుడు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట గోపాల సత్యనారాయణ ఆధ్వర్యంలో టిడిపికి చెందిన ఆరు కుటుంబాలు వైసిపిలో చేరారు. పైడి హరి, పైడి శశి, సన్యాసిరావుతో పాటు మరో మూడు కుటుంబాలు వైసిపిలో చేరారు. పార్టీలో చేరిన వారందరికి వైసిపి కండువాలు వేసి సత్యనారాయణ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పైడి నరసింహ అప్పారావు, కార్యకర్తలు బగాది రామారావు, కిల్లి నరసింగరావు, పైడి చలపతి, సువ్వారి అన్నంనాయుడు, దుంపల రామారావు, పైల లక్ష్మణరావు, సీపాన నాగం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలారావురెడ్డి జయంతి

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ కీర్తిశేషులు పిలక పోలారావురెడ్డి జయంతిని ఆయన కుటుంబ సభ్యులు సోమవారం ఘనంగ నిర్వహించారు. బెల్లుపడ, అచ్చంపేట వద్ద ఉన్న పోలారావురెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ పోలారావురెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సమయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, పిలక సంతోష్, కె.మోహన రావు, ఉప్పాడ చిన్నబాబురెడ్డి, పిలక యాదవరావు, కృష్ణారావు పాత్రో, పత్రీ తవిటయ్య, కాళ్ల దిలీప్, లీలారాణి, నీలపు లక్ష్మి, భీష్మ, పరపతి కోటి పాల్గొన్నారు.

విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలి

పోలాకి : మాట్లాడుతున్న రవికుమార్

పోలాకి : ఈ నెల 12న నిర్వహించనున్న డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలని ఆరోగ్య విస్తరణ అధికారి డాక్టర్ నల్లి రవికుమార్ తెలిపారు. జిల్లా ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వెంకట్ ఆధ్వర్యాన పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పోలాకి ఎంపిపి పాఠశాలు, గంటపేట అంగన్వాడీ కేంద్రాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం గురించి ఆరా తీశారు. నులిపురుగుల నివారణ మందులు సక్రమంగా పంపిణీ చేసిందీ లేనిదీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీధర్, మోహిని, శ్రీమంగం శేఖర్‌బాబు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొందూరు: జిల్లాలో ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎన్‌డిడి కార్యక్రమం రాష్ట్ర మోనటరింగ్ అధికారి డా.బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. మండలంలోని కనిమెట్ట అంగన్‌వాడీ కేంద్రం, కింతలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి కార్యక్రమంపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా నులిపురుగల నివారణా కార్యక్రమానికి సంబంధించి మందులు సరఫరా, కేంద్రాల వద్ద ప్రచార పోస్టర్లు, పారిశుధ్యం, తాగునీరు, ప్రథమ చికిత్స పెట్టెలు వంటివి అందుబాటులో ఉన్నదీ లేనిది అడిగి తెలుసుకున్నారు. ఈమెతో పాటు వైద్యాదికారి శివశంకర్, ఎంపిహెచ్ఇఒ చెరుకూరి వెంకటరావు, వైద్య, అంగన్వాడీ సిబ్బంది ఉన్నారు.

పొందూరు : సిబ్బందితో మాట్లాడుతున్న మీనాక్షి

కీర్తనను అభినందిస్తున్న కలెక్టర్

కిక్ బాక్సింగ్‌లో కీర్తన ప్రతిభ

ప్రజాశక్తి- పొందూరు

మండలం రాపాక గ్రామానికి చెందిన ఎచ్చెర్ల కీర్తన కిక్ బాక్సింగ్‌లో రాణిస్తూ అద్భుత ప్రతిభను కనబరుస్తుంది. ఈనెల 10న విశాఖపట్నంలోని ఆంధ్రాయూనివర్శిటీ బాక్సింగ్ హాల్‌లో హెచ్‌సిజి కేన్సర్ ఆస్పత్రి కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్-10 బాలికల విభాగంలో కీర్తన ప్రతిభను కనబరిచి రెండో స్థానంలో నిలిచింది. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కీర్తనకు మెడల్, ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. చిన్నారి కీర్తన ఎచ్చెర్లలోని బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతుంది.

మైక్‌సెట్ అందిస్తున్న దాతలు

మైక్‌సెట్ వితరణ

కవిటి: మండలంలోని కుసుంపురం మోడల్ ప్రైమరీ పాఠశాలకు ఇరు జంటలు సంయుక్తంగా మైక్ సెట్ అందించారు. రూ.14,700 విలువ చేసే మైక్ సెట్‌ను దానయ్య, దేవిక దంపతులు, రాజారావు, ఢిల్లేశ్వరి దంపతులు సంయుక్తంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శమల్ల రాజబాబుకు సోమవారం అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసి చైర్మన్ ఎల్.భారతి, ఉపాధ్యాయులు ఎన్.సుజాత, జగన్నాథ్ దళాయి, కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నీమాస్త్రంతో పురుగుల నివారణ

ప్రజాశక్తి- కవిటి

నీమాస్త్రం ఉపయోగించి పంటలో పురుగుల వ్యాప్తిని నివారించవచ్చని డిఎంఎంటి తులసయ్య తెలిపారు. మండలంలోని శిలగాంలో కడియాల సుహాసిని వ్యవసాయ క్షేత్రంలో ఎటిఎం, ఎ-గ్రేడ్ పంటల కోసం నిమస్త్రం తయారు చేశారు. ఈ నీమాస్త్రం తయారీలో భాగంగా దేశీ ఆవు పేడ 2 కిలోలు, ఆవు మూత్రం 10 లీటర్లు, నీరు 200 లీటర్లు, రుబ్బిన వేపాకులు 10 కిలోలు కలిపి 48 గంటలు మరగ పెట్టి, వడపోసి 30 రోజులపాటు నిల్వ ఉంచి సాయంత్రం పూట పంటపై పిచికారీ చేయాలని సూచించారు. ఈ విధంగా తయారు చేసిన నీమాస్త్రం ద్రావణం పీల్చే పురుగులు, వాటి గుడ్లను నివారిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పిలు సంతోషి, స్వాతి, జయ పాల్గొన్నారు.

నీమాస్త్రం తయారు చేస్తున్న మహిళలు

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే శిరీష

ఎమ్మెల్యే పరామర్శ

వజ్రపుకొత్తూరు : మండలంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గౌతు శిరీష సోమవారం పరామర్శించారు. టిడిపి నాయకులతో కలిసి మృతుల కుటుంబాల ఇంటికి వెళ్లి బాధితులను ఓదార్చారు. సముద్రంలో పడి మృతి చెందిన దున్ను దుర్యోధన, జస్వంత్ కుటుంబాన్ని కలిసి ఓదార్చారు. ఆమెతో పాటు టిడిపి నాయకులు సురాడ మోహనరావు, గోరకల వసంతరావు, పుచ్చ ఈశ్వరరావు, అరసవల్లి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.